బుద్ధి యజ్ఞమూర్తి

# తన వాళ్ల కోసం....

**తలుపు చప్పుడయ్యింది. 'ఎవరూ?' అంటూ సీతారాం మగ్గం ఆపి ఒక పక్కకి వంగి చేతితో తలుపు పూర్తిగా తెరిచాడు. ఈలోగా వంట గదిలో ఉన్న యశోద కూడా అక్కడికి వచ్చి గుమ్మం వద్దనున్న అపరిచితుడి వంక ఆశ్చర్యంగా చూసింది.**

'ఎవరూ?' అన్నాడు సీతారాం భార్య వంక ప్రశ్నార్థకంగా చూస్తూ.

'ఏమో' అని 'ఎవరు కావాలండీ?' అంది వచ్చినతనితో.

అతను చిన్నగా నవ్వుతూ లోనికి వచ్చాడు. మగ్గంలో వున్న సీతారాంని చూసి 'అరే, నేనురా జనార్దన్‌ని' అన్నాడు.

'ఒరే నువ్వా... ఏంటీ ఈ సడన్ విజిట్' అంటో మగ్గం లోంచి లేచి వచ్చాడు.





యశోదకి మిత్రుణ్ణి పరిచయం చేశాడు. ఆమె మళ్ళీ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

'నేను నమ్మలేక పోతున్నానురా. నువ్వేమిటి ఇట్లా బట్టలు నేసుకోవడమేమిటి?'

'నేనూ నమ్మలేక పోతున్నా, నువ్విట్లా రావడం'

'నాకు తెలుసు. నువ్వు చాలా అడగాలనుకుంటున్నావు కదా నన్ను. ఎలా నిన్ను కనుక్కోగలిగానా, ఇప్పుడిక్కడికి ఎందుకు వచ్చానా, ఏం చేస్తున్నానా అని అడగాలను కుంటున్నావు కదా'

జనార్దన్ మారలేదు. వాగుడుకాయ. అలాగే ఉన్నాడు అప్పట్నించీ.

కాలేజీలో ఇద్దరూ సహాధ్యాయులు. సీతారాం అంటే జనార్దన్‌కి మొదట్నించీ ఈర్ష్య. ఎందుకంటే సీతారాం అన్ని విషయాల్లోనూ జనార్దన్ కంటే ఒక అడుగు ముందు ఉండేవాడు. ఇద్దరి మధ్యా ప్రచ్ఛన్న యుద్ధం (జనార్దన్ వైపు నుంచి) పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేదాకా సాగింది. విడిపోయే ముందు 'ఇది అంతం కాదు. ఒకరోజు నీకంటే నేనే ముందుంటాను' అన్నాడు జనార్దన్.

'అరే. అన్నింటినీ అట్లా సీరియస్‌గా తీసుకుంటావెందుకు. నీతో నేను అసలు పోటీ పడందే' అని సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు సీతారాం.

యశోద ఇచ్చిన టీ తాగుతూ కబుర్లలో పడ్డారు మిత్రులిద్దరూ.

'కొంతకాలంగా సొంత ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకోవడంలో బిజీ ఐపోయాను. మధ్యమధ్యలో మన కాలేజీ లైఫ్ జ్ఞాపకం వచ్చి బాధ పెట్టేది నన్ను. అందులోనూ ముఖ్యంగా నువ్వు జ్ఞాపకం వచ్చేవాడివి. నేనెట్లా నీపట్ల కుత్సితంగా ప్రవర్తించిందీ గుర్తుకొచ్చి నన్ను మరీ వేధించేది. నా పద్ధతి ఎట్లా ఉన్నా నువ్వు నా పట్ల ఎంత బాగా వుండిందీ, నాకెలా సాయం చేసిందీ జ్ఞాపకం చేసుకునేవాణ్ణి' అని ఆగి 'ఇంతకీ నేనెందుకు వచ్చిందీ చెప్పలేదూ కదూ. ఒక కాన్ఫరెన్సు పని మీద వచ్చాను. కొద్ది రోజులు చీరాలలోనే ఉంటాను. రేపు, ఎల్లుండి కొంచెం బిజీ. శుక్రవారం మధ్యాహ్నం మళ్ళా కలుస్తాను. ఆ రోజు నీతోటే వుంటా. నీకేం అభ్యంతరం వుండదుగా' అన్నాడు జనార్దన్.

'ఎందుకు అభ్యంతరం. ఐనా నేనిక్కడ వుంటున్న సంగతి ఎట్లా తెలిసింది నీకు?'

'ఇస్మాయిల్ గుర్తున్నాడా? మన పాత కాలేజీ కొలీగ్. పోయిన యేడు ట్రైన్‌లో నువ్వూ వాడూ కలుసుకుని ఒకరి అడ్రసులు ఒకరు ఇచ్చి పుచ్చుకున్నారటగా. ఉత్తరాలు రాసుకుందామని. ఐతే మామూలుగానే నువ్వు వాడికి రాయలేదనుకుంటా.'

'నేను కార్డు రాశానే వాడికి'

'తెలుసులే. ఐనా పాడి పలకరింపులు వర్కవుట్ అవుతాయా. వాడు ఓ రెసిడెన్షియల్ కాలేజీలో లెక్చరర్ గిరీ సంపాదించాడు. అక్కడ ఒక సైన్సు ఎగ్జిబిషన్ జరిగితే నాకూ ఆహ్వానం అందింది. అక్కడే మేం కలుసుకున్నాం. కాలేజీ గురించీ, స్నేహితుల గురించీ, ముఖ్యంగా నీ గురించీ మాట్లాడుకున్నాం. నీ స్థితి చెప్తే నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అందుకే ఇప్పుడు నీకు ఆశ్చర్యం కల్గించాలని వచ్చాను, నీకు ఇష్టం వున్నా లేకపోయినా'

'ఎంత్రా మాటలు. నాకిష్టం ఉండకపోవడమేమిటి? సరే. ఇంతకీ నీ సంగతులు చెప్పు.'

'చెప్తా. చెప్తా. నేను ప్రస్తుతం రీసెర్చి అసోసియేట్‌గా పని చేస్తున్నా. త్వరలోనే పూర్తికాలం జియాలజిస్టుని అవుతా. నమ్ముతావా, ఇప్పుడు నేను చాలా కష్టపడి పనిచేస్తున్నానని మరో మూడు నెలల్లో మా డిపార్ట్‌మెంట్‌కి నేనే హెడ్‌ని కూడా కావచ్చు.'

'నిజంగా. చాలా ఆనందంగా ఉంది జనార్దన్. నువ్వెప్పుడూ కష్టపడుతూనే ఉంటావు. డిపార్ట్‌మెంట్ హెడ్‌వి అయ్యాక నాకు తెలియజెయ్యడం మరచిపోలేక... అవునూ... నీ ఫ్యామిలీ గురించి ఒక్క ముక్కా చెప్పలేదు.'

'తన పేరు నక్షత్ర. టాటా కన్సల్టెన్సీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఒక్కడే కొడుకు. ఎనిమిదేళ్ళొచ్చాయి. థర్డ్ స్టాండర్డ్ చదువుతున్నాడు. సరే. ఇంక నీ సంగతి చెప్పు. అన్నిట్లోనూ ముందుండేవాడివే. నువ్వేమిటి ఇట్లా...'

'ఇప్పుడేమైంది. నేను బానే ఉన్నా. ఈ లైఫ్‌లో సెల్ఫ్ శాటిస్‌ఫాక్షన్ ఉంది'

'ఇస్మాయిల్ చెబితే అసలు నమ్మలేకపోయా. నువ్వు నేత నేసుకుంటూ మీ వూళ్ళోనే ఉన్నావంటే - నాకేమీ సంతోషంగా అన్పించలేదు. నీ టాలెంట్ అంతా ఇట్లా వృధా చేసుకుంటున్నావేమిటి? బట్టలు నేయటానికా నీ టాలెంట్‌ని యూజ్ చేస్తోంది?'

జనార్దన్ మాట్లాడుతుంటే మౌనంగా విన్నాడు సీతారాం. తర్వాత మృదువుగా అన్నాడు - 'ఎవరన్నారు ఫ్రెండ్ నేను నా వ్యక్తిత్వాన్ని చంపుకుంటూ ఇక్కడ ఉంటున్నానని. నిజం చెప్పమంటావా. ఇప్పుడు నేను చేస్తున్న పనిలో ఎంత ఆత్మసంతృప్తి ఉందో తెలుసా. నా వాళ్ళ కోసం పోరాటంలో నేనూ నా వాళ్ళకి మల్లే జీవించాలనుకున్నా. నా వాళ్ళంతా ఇక్కడ కష్టాలు పడుతుంటే నేను పంతులుగా ధర్మపన్నాలు వల్లిస్తూ వుండలేక పోయాను. అందుకే వచ్చేశాను ఇక్కడికి. ఇప్పుడు వీళ్ళందర్నీ వదిలిపెట్టి ఎక్కడికి వెళ్ళను?'

మధ్యలో అడ్డుకున్నాడు జనార్దన్.

'ఏమో సీతారాం. అట్లా అని నిన్ను నువ్వు మోసం చేసుకుంటున్నావేమో ఆలోచించు. మనం సంస్కర్తలం కాదు,

